# 51

# యెరూషలేములో యేసు

## (21:12-27)

ఆయనకు ప్రతికూలముగా నున్న ఒక పట్టణములోనికి ఆయన ప్రవేశించుచుండెనని యేసు ఎరిగియుండెను, ఏలయనగా అచ్చటి అధికారులు ఆయనను ద్వేషించుచుండిరి. పస్కా పండుగ సందర్భములో ఆయన పట్టణములోనికి ప్రవేశించుచుండినప్పుడు అమితోత్సాహముతో నిండిన జనసమూహముల చేత ఆయనకు గంభీరమైన స్వాగతమివ్వబడినదని మత్తయి 21:8-11 మనకు తెలియజెప్పుచున్నది. అప్పుడు యేసు మొదట ఏంచేసాడు?

### యేసు దేవాలయమును శుద్ధీకరించుట (21:12, 13)

**12యేసు దేవాలయములో ప్రవేశించి క్రయవిక్రయములు చేయువారినందరిని వెళ్లగొట్టి, రూకలు మార్చువారి బల్లలను గువ్వలమ్మువారి పీఠములను పడద్రోసి– 13నా మందిరము ప్రార్థన మందిరమనబడును అని వ్రాయబడియున్నది, అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను.**

మత్తయి సువార్త రచయిత యేసు విజయోత్సవముతో యెరూషలేములోనికి ప్రవేశించుట గూర్చి చెప్పిన వెనువెంటనే ఆయన దేవాలయమును శుద్ధీకరించిన విషయాన్ని రాస్తున్నాడు, అయితే యేసు యెరూషలేములోనికి విజయోత్సవముతో ప్రవేశించిన మరుసటి రోజున, ఆయన యెరూషలేములోనికి మరొక పర్యాయము ప్రవేశించిన దినాన దేవాలయమును శుద్ధీకరించాడని సూచిస్తూ మార్కు సువార్త రచయిత కొంచెం భిన్నంగా రాస్తున్నాడు (మార్కు 11:11-19). అనగా, వాస్తవమునకు యేసు దేవాలయమును శ్రమల వారములోని సోమవారము నాడు శుద్ధీకరించాడని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

దేవాలయమును శుద్ధిచేయుట గూర్చి సమదృక్పథ సువార్తలలోని వివరములకును (21:12, 13; మార్కు 11:15-18; లూకా 19:45, 46), యోహాను వ్రాసిన సువార్త ఆరంభములో వర్ణింపబడిన దానికిని మధ్య గల సంబంధమునకు సంబంధించినది, కలవరపాటు కలిగించు ఒక ప్రశ్న కలదు (యోహాను 2:13-17). ఇవన్నీ ఒక సంఘటనయా – క్రీస్తు శ్రమల వారములో సంభవించిన సంఘటనయా? లేక, యోహాను (విశేషముగా కాలక్రమానుగతముగా కంటే) వేదాంతపరమైన హేతువులనుబట్టి ఈ శుద్ధీకరణ సంఘటనను తాను రచించిన సువార్త తొలి పుటల్లోనే ఉంచియుండునా? ఈ రెండు సంఘటనలు వేరువేరై యుండినవని, ఒకటి యేసు తన పరిచర్యను ప్రారంభించిన తొలి రోజుల్లోనే జరిగినది, రెండవది యేసు పరిచర్య ముగింపులో జరిగినదని మనము నమ్మవలసి యున్నదా? ఈ రెండింటిలోను వేర్వేరు వివరములు మరియు కాలక్రమానుగత స్థలములున్నవా? యేసు దేవాలయమును శుద్ధీకరించిన యోహాను సువార్తలోని వివరము

వెనువెంట గల ఒక వాంగ్మూలము రెండవ దృక్పథమును సమర్థించుచున్నది. వారు దేవాలయమును నలువదియారు సంవత్సరములు కట్టుచుండిరని యూదులన్నారు (యోహాను 2:20). ఈ దేవాలయ పునఃనిర్మాణము సుమారు క్రీ.పూ. 19లో హేరోదు మహా రాజు చేత మొదలుపెట్టబడినది,[1] ఈ వివరము యోహాను సువార్తలో వ్రాయబడిన దేవాలయము శుద్ధీకరింపబడిన దానికి సంబంధించిన తేదీని క్రీ.శ. 27గా - యేసు తన పరిచర్యను ప్రారంభించిన తొలి రోజుల్లో జరిగిన సంఘటనగా-చెప్పుచున్నది.

**వచనము 12. యేసు దేవాలయములో ప్రవేశించాడు.** మెస్సీయా ఈ దేవాలయమును సందర్శించు ఒక కాలమును ప్రవక్తయైన మలాకీ ముందుగా తెలియజెప్పాడు. "ఆయన కంసాలి అగ్నివంటివాడు, చాకలివాని సబ్బువంటివాడు," "లేవీయులు నీతిని అనుసరించి యెహోవాకు నైవేద్యములు చేయునట్లు వెండి బంగారములను నిర్మలము చేయు రీతిని ఆయన వారిని నిర్మలము చేయును" (మలాకీ 3:1-4). ఇది యెహెజ్కేలు 40-48 మరియు జెకర్యా 6:12, 13లోని దర్శనముల ఆధారంగా యూదులు మెస్సీయా రాక గూర్చి కలిగియుండిన నిరీక్షణకు సరిపడినది. మెస్సీయా వచ్చి దేవాలయమును పవిత్రపరచి దానిని పునరుద్ధరించునని యూదులు నమ్మారు. ఆయన వచ్చి అన్య మతారాధికులుగా విజేతలైయుండిన అంతియొకయ ఎపిఫనేస్ చేత క్రీ.పూ. 167లోను, పోంపే చేత క్రీ.పూ. 63లోను అపవిత్రము చేయబడిన పవిత్ర స్థలమును పునఃపవిత్రము చేసి దానిని దేవుని సొంత ప్రజలే చేయుచుండిన అబద్ధ ఆరాధనల నుండి శుద్ధీకరించును.[2]

ఈ శుద్ధీకరణము గూర్చిన ఆలోచన పాత నిబంధనలో ప్రవక్తలు రాసినవని చెప్పే దొంగ రచనలలో కూడ, ముఖ్యంగా యూదులవి, రచింపబడి యున్నది: "చూడు, ప్రభువా, నీ సేవకుడైన ఇశ్రాయేలును మీరెరిగిన కాలములో ఏలునట్లు, ఓ దేవా, వారి కొరకు ఒక రాజును, దావీదు కుమారుని లేవదీయుము. ... ఆరంభము నుండి కూడ అది ఉండినట్లుగానే, యెరూషలేము పరిశుద్ధమైనదగునట్లు ఆయన దానిని ప్రక్షాళనము గావించును."[3] మత్తయి సువార్తలో అంతకు ముందు, దేవాలయముపై ఆయనకు గల అధికారమును యేసు ప్రకటించాడు (12:6పై గల వ్యాఖ్యానములను చూడు). యేసు దేవాలయమును శుద్ధీకరించుట, భవిష్యత్తులో జరుగనై యున్న దాని నాశనమును సూచిస్తూ, తీర్పునకు ఒక సంకేతముగా ప్రయోజనమగుచున్నది (24:1, 2). త్వరలోనే, యేసు ఒక నూతన "ఆలయమును" అనగా సంఘమును స్థాపించును, అందులో పవిత్రమైన బల్యర్పణలు గావింపబడును (రోమీయులకు 12:1, 2; 1 కొరింథీయులకు 3:16, 17; హెబ్రీయులకు 13:15).

"దేవాలయము" అను మాటను ప్రస్తావించుటకు, *naos* అను మాటకు బదులుగా *hieron* అను పదము వాడబడుట, శుద్ధీకరణము వెలుపలి ప్రాంగణములో జరిగినదని సూచించుచున్నది. ఈ ప్రాంగణము "అన్యజనుల ప్రాంగణము" అని పిలువబడినది ఏలయనగా ఈ స్థలము అన్యజనులును యూదులును ప్రవేశించుటకు అనుకూలంగా అందుబాటులో ఉండినది. అన్నిటిని సమకూర్చుకొని వ్యాపారము సాగించుచుండిన కార్యకర్తలు వారి వాణిజ్యములను నిర్వహించుకొనుచుండినది ఈ స్థలములోనే. అన్యమతారాధికుల ఆలయములోని *naos* అనునది, విగ్రహము ఉంచబడిన స్థలమై యుండినది. యూదుల దేవాలయములో అది పరిశుద్ధ స్థలమై యుండినది.

యేసు అన్యజనులు కూడుకొను ప్రాంగణములో ప్రవేశించినప్పుడు, **ఆయన క్రయవిక్రయములు చేయువారినందరిని వెళ్లగొట్టెను**. దేవాలయ శుద్ధీకరణము గూర్చి యోహాను వ్రాసిన సువార్తలో గొఱ్ఱెలు మరియు ఎడ్లు అమ్మబడుచుండినవని నిర్దిష్టముగా పేర్కొనబడి యున్నది (యోహాను 2:15). ధర్మశాస్త్రము ప్రకారము దేవాలయమునకు చాలినంత దూరములో నివసించు యూదుడు బలిపశువును తన సొంత మందలో నుండి తీసుకొని వచ్చుటకు బదులుగా పట్టణములోపల కొనుక్కొనుటకు అనుమతింపబడినాడు (ద్వితీయోపదేశకాండము 14:24-26).

యేసు ఖండించినది ఈ వాడుకను కాదు, కానీ విశేషంగా ఆలయ ప్రాంగణమునకు పరిసరములో నుండిన ప్రదేశము ప్రజల చేత ప్రయోజనము పొందబడుచున్న చెడు విధానములను ఆయన ఖండించాడు. క్రయవిక్రయములు జరుగుచుండిన స్థలము ఒక సమస్యయై యుండినది; దేవాలయములోని పరిశుద్ధ ప్రాంగణములో వర్తకులు తమ వ్యాపారములను నిర్వహించుటను ఆయన వ్యతిరేకించాడు. అన్యాయము, మరొక సమస్యయై యుండినది. అన్యజనులు కూడుకొను ఆలయ ప్రాంగణములో వ్యాపారులు తమ లావాదేవీలు నిర్వహించుకొనునట్లు వారికి చిన్న చిన్న నిర్దిష్ట స్థలములను అమ్ముకొనుట ద్వారా ప్రధాన యాజకులు వారి సిరిసంపదలను అధికంచేసుకొనుటకు ధర్మశాస్త్రమును వారి స్వప్రయోజనముల కొరకు అనువైన సాధనంగా చేసుకొనుచుండిరి. ఈ వర్తకులు వస్తుసామగ్రిని మితిమీరిన ధరలకు అమ్ముచుండిరి. ఇంకా, బల్యర్పణల కొరకు ఇతర స్థలముల నుండి తేబడిన జంతువులను ప్రధాన యాజకులు తృణీకరించుచు, వారి సొంత లాభం కొరకు వారు ఆమోదించిన స్థలములో కొనుగోలు చేయబడిన వాటిని మాత్రమే అంగీకరించుచుండిరి.[4]

అమ్ముచుండిన వారిని మరియు కొనుగోలు చేయుచుండిన వారిని వెలుపలికి వెళ్లగొట్టుటతో పాటుగా, యేసు **రూకలు మార్చువారి బల్లలను గువ్వలమ్మువారి పీఠములను పడద్రోసెను**. మిశ్నా ప్రకారము "రూకలు మార్చువారు" వారి బల్లలను దేవాలయములో అకరు నెలలోని ఇరవై ఐదవ దినమున, పస్కా పండుగ చేసికొనబడు నీసాను మాసమునకు ముందటి మాసములో, ఏర్పాటు చేసికొన్నారు.[5] ప్రాథమికంగా ఆలయ పన్ను చెల్లించుటకు (17:24పై గల వ్యాఖ్యానము చూడు) మరియు బల్యర్పణలకు అవసరమై యుండు బలిపశువులను మరియు ఇతర వస్తుసామగ్రిని (ద్రాక్షరసము, నూనె, మరియు పిండి మొదలగు) కొనుగోలు చేసికొనుట అనుకూలతను కల్పింపవలెనను ఉద్దేశముతో ఈ ఏర్పాటు చేయబడింది.[6] రూకల మార్పిడి ఎల్లప్పుడు ఏకరీతిగా చెలామణిలో నుండు ప్రామాణికమైన నాణెములలోనికి గావించుట యుండినది ఏలయనగా యాత్రికులు రోమా సామ్రాజ్యములోని నలు మూలల నుండి వచ్చుచుండిరి మరియు వారితో కూడ వేర్వేరు నాణెములను తెచ్చుచుండిరి.

యెరూషలేమునకు వచ్చుచుండినవారు తెచ్చుచుండిన అనేక నాణెములు అన్యమతారాధికుల ముద్రలు లేదా చక్రవర్తి ప్రతిరూపము కలిగియుండినవి – ఇది యూదులకు ఏహ్యామై యుండినది (నిర్గమకాండము 20:4; ద్వితీయోపదేశకాండము 4:16-18; 5:8) – అందు వలన విదేశి నాణెములు మార్చబడవలసి యుండినదని కొందరు చెప్పుదురు. అట్లయినను, వాస్తవమునకు నాణెములు తూరు దేశ నాణెములుగా మార్చబడినవని ప్రాచీన

ఆధారాలు సూచించుచున్నవి.[7] స్పష్టముగా, తూరు దేశ నాణెము హెబ్రీ నాణెమునకు దాని విలువలో అతి సమీపమైనదై యుండెను. తూరు దేశ పురుషులు వర్తకులై యుండిరి, గనుక వారి నాణెములు వాటి తూకము మరియు అవి కలిగియుండవలసిన వెండి లేదా బంగారము నిష్పత్తిలో సరైనవిగాను ఉండినవని విశ్వసింపబడినది.[8] తూరు దేశ షెకెలు (లేక టెట్రడ్రాఖ్మ) దాని ముఖభాగముపై ఫేనీకేయుల దేవత మేల్ఖాం ప్రతిమను మరియు రెండవ ప్రక్క ఒక గరుడపక్షి ప్రతిమను కలిగియుండినది. తూరు దేశములో నాణెములు ముద్రించుచుండిన టంకసాలను మూసివేసిన తరువాత, అవే నాణెములు ఇశ్రాయేలు దేశములో ముద్రింపబడునట్లు రోమా ప్రభుత్వము అనుమతించినది. ఏది ఏమైనా, యూదులకు స్వయం ప్రతిపత్తి కలిగించబడినదను మనోభావములకు చోటివ్వకుండునట్లు, ఆ నాణెములపై అదివరకటి బొమ్మలనే ఉంచవలసి వచ్చినది. తూరు దేశ నాణెములు (షెకెలు) యూదుల తిరుగుబాటు సంవత్సరము క్రీ.శ. 66 వరకు ఉపయోగములో ఉండినవి.

మన ప్రభువైన యేసు క్రీస్తు రూకల మార్పిడిని విమర్శించలేదు. ఏది ఏమైనా, ఆ మార్పిడి పనులు ఆలయ ప్రాంగణములో చేయబడుచుండిన విషయముతో ఆయన ఏకీభవించలేదు. ఈ మార్పిడి సేవల సందర్భములో యాత్రికులపై మితిమీరిన భారమును (వెలను) వేయు వాడుకను ఆయన నిశ్చయముగా వ్యతిరేకించాడు. బలి పశువులను అమ్ముచుండినవారి విషయములో వలెనే, ఆలయ ప్రాంగణములో రూకలు మార్చుచుండినవారి విషయమును కూడ ప్రధాన యాజకులు ఆమోదింపవలసి యుండినది.

యేసు **గువ్వలమ్మువారి పీఠములను పడద్రోసాడు**. పేదలు గొఱ్ఱెపిల్లకు బదులుగా పావురములు అర్పించుచుండిరి (లేవీయకాండము 5:7; 12:6, 8; 15:14, 29). యేసు తల్లియైన మరియ ఆయనకు జన్మనిచ్చిన తరువాత తనను తాను శుద్ధిచేసికొనవలసిన దినములు వచ్చినప్పుడు ఈ అర్పణను అర్పించినది (లూకా 2:22-24). పావురములు అమ్ముచుండినవారు కొన్ని పర్యాయములు విపరీతంగా పెరిగిపోయిన ధరలకు అమ్ముచు, ప్రజలను మోసము చేయుచుండిరని మిశ్నా సూచించుచున్నది.[9] కాబట్టి అచ్చటి వర్తకులను యేసు "దొంగలు" అని పిలిచాడంటే ఆశ్చర్యమేమున్నది (21:13).

మార్కు 11:16 ప్రకారము, "దేవలయము గుండ ఏ పాత్రయైనను ఎవనిని తేనియ్యకుండెను." మిశ్నాలో వ్రాయబడియున్న విషయముతో ఈ నిషేదము ఏకీభవించుచున్నది: "ఒకడు [దేవాలయ పర్వతమును] దగ్గరి దారి నిమిత్తము ఉపయోగించ కూడదు."[10]

**వచనము 13.** క్రయవిక్రయములు చేయుచుండిన వారిని మరియు రూకలు మార్చుచుండిన వారిని యేసు వెళ్లగొట్టిన తరువాత, ఆయన దేవాలయము అచ్చట ఉండుటలో గల అసలు ఉద్దేశమును ఒక ఉల్లేఖనముగా ప్రకటించాడు: **నా మందిరము ప్రార్థన మందిరమనబడును అని వ్రాయబడి యున్నది** (యెషయా 56:7). యేసు చేసిన విమర్శ, డొనాల్డ్ ఏ. హేగ్నర్ గమనిక ప్రకారము, పాత నిబంధన ప్రవక్తలు చేయుచుండిన విమర్శల వలెనే యున్నది: యాంత్రికముగా కొనసాగుచుండిన ఆలయ కృతులు దేవునితో సత్సంబంధము కలిగియుండవలెనను అసలు లక్ష్యమును కమ్మివేసాయి (యిర్మీయా 7:21-23; ఆమోసు 5:21-24; మీకా 6:6-8).[11] యెషయా 56:7లోని ఈ ఉల్లేఖనమును, "సమస్తమైన అన్యజనులకు" అను అదనపు పదజాలముతో మార్కు 11:17 పొడిగించుచున్నది.

మత్తయి వ్రాసిన సువార్తలో లేనప్పటికిని, ఈ పదజాలము ప్రాముఖ్యమైనదై యున్నది ఏలయనగా అన్యజనులు కూడుకొనుచుండిన ప్రాంగణము ఒక సంత వీధిగా మార్చబడిన ప్రాంగణమువలె ఉండినది. యూదుల వాణిజ్య కార్యకలాపములు అన్యజనులు దేవుని ఆరాధించుటకు చేయుచుండిన మనఃపూర్వకమైన వారి ప్రయాసములకు కలత కలిగించుచుండినట్లు అగుపించుచున్నది. ఈ అన్యజనులు లోపలి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించకుండునట్లు కట్టుదిట్టము చేయబడి యుండిరి.[12]

యేసు **అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను.** ఈ మాటలు యిర్మీయా 7:11లో నుండి తీసికొనబడినవి: “నాదని చాటబడిన యీ మందిరము, మీ దృష్టికి దొంగలగుహయైనదా? ఆలోచించుడి, నేనే యీ సంగతి కనుగొనుచున్నాను. ఇదే యెహోవా వాక్కు.” ఆ సందర్భములో, యూదా దేశ ప్రజలు, దేవుని యెదుట విశ్వాసముతో కూడిన పరిశుద్ధ జీవితము జీవించుటకు బదులుగా, విశేషంగా వారి మధ్య నెలకొనియుండిన దేవుని ఆలయమునందు విశ్వాసముంచుచుండిరి. వారు తమ పాపములకు ప్రతిఫలముగా శిక్ష నొందకుండ క్షేమముగా ఉన్నారని తమలో అనుకొంటూ, ఒక గుహలో దాగుకొనుచుండిన దొంగల వలె ఉండిరి. ఈ మాటలను యేసు తన కాలమందలి దేవాలయమునకు అన్వయించాడు. మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా వ్రాయుచున్నాడు,

> దొంగలు వారు దాగుకొను బిలములతో–నిషేధింపబడిన విధానముల ద్వారా సంపాదించుకొనుచుండిన ధనమును కూడబెట్టుకొనుటకును, న్యాయవిరుద్ధమైన భవిష్యత్ కార్యకలాపములకు వ్యూహములు రచించుకొనుటకు అనువైన ఆశ్రయము నిచ్చుచుండిన స్థలములై యుండిన వాటితో – వ్యవహరించినట్లుగా, మతపరమైన నాయకులు దేవాలయముతో వ్యవహరించుచుండిరి. పాలస్తీన దేశములో ఉండిన గుహలు దొంగల గుహలవలె సక్రమంగా సద్వినియోగము చేసికొనుబడుచుండినవి, గనుక యేసు తన శ్రోతలకు తెలియజెప్పుచుండిన రూపకాలంకారము వారికి సుస్పష్టమైనదై యుండినది.[13]

యేసు చేపట్టిన చర్యలు – బల్లలను పీఠములను పడద్రోయుట, వర్తకులందరిని ఆలయములో నుండి వెలుపలికి వెళ్లగొట్టుట – యూదుల ఆలయ రక్షక సిబ్బంది నుండి గాని రోమా ప్రభుత్వ సైనిక బలగము నుండి గాని తత్క్షణ ప్రతిచర్య తలెత్తుటకు తావియ్యలేదు (చూడు అపొస్తలుల కార్యములు 21:27–36). యేసుకు ప్రజలలో ఎంతో గొప్ప ఆదరాభిమానములు ఉండుట వలన ఆ సమయములో యూదుల అధికారులు ఆయనకు వ్యతిరేకముగా ఎటువంటి ప్రతిచర్యనైనను చేపట్టలేకపోయారు. ఏది ఏమైనా, వారు ఏదో ఒక విధముగా “ఆయనను సంహరించుటకు” మార్గము వెదకుచుండిరి (మార్కు 11:18). వర్తకులు మరియు రూకలు మార్చువారు దేవాలయ దక్షిణ పర్వత ప్రదేశములోని రాజ ప్రాంగణములో ఏర్పాట్లు చేసికొన్నందు వలన, జనసమూహములలో జరుగుచుండిన ప్రతి విషయమును జాగ్రత్తగా గమనించుచుండుటకు వాయవ్య మూలలోని అంతోనియ కోటలో స్థావరమేర్పరచుకొని యుండిన రోమా ప్రభుత్వ సైనికులకు అది అతి కష్టమైన కార్యమై యుండేదే.

## యెరూషలేములో చేయబడిన చివరి స్వస్థత కార్యములు (21:14-17)

**[14]గ్రుడ్డివారును కుంటివారును దేవాలయములో ఆయనయొద్దకు రాగా ఆయన వారిని స్వస్థపరచెను. [15]కాగా ప్రధానయాజకులును శాస్త్రులును ఆయన చేసిన వింతలను, -దావీదు కుమారునికి జయము అని దేవాలయములో కేకలు వేయుచున్న చిన్న పిల్లలను చూచి కోపముతో మండిపడి [16]-వీరు చెప్పుచున్నది వినుచున్నావా? అని ఆయనను అడిగిరి అందుకు-యేసు వినుచున్నాను;**

**బాలురయొక్కయు చంటిపిల్లలయొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితివి**

**అను మాట మీరెన్నడును చదువలేదా? అని వారితో చెప్పి [17]వారిని విడిచి పట్టణమునుండి బయలుదేరి బేతనియకు వెళ్లి అక్కడ బసచేసెను.**

**వచనము 14.** యేసు కొందరిని **దేవాలయములో** నుండి బలవంతముగా బయటికి వెళ్లగొట్టుచునే, ఆయన రోగులను ఆయన యొద్దకు ఆహ్వానించి ఆయన యొద్దకు **వచ్చినవారందరిని స్వస్థపరచెను**. ఈ గ్రంథ పాఠము గ్రుడ్డివారు మరియు కుంటివారి గూర్చి నిర్దిష్టముగా పేర్కొనుచున్నది (చూడు 11:5; 15:30, 31). లేవీయకాండము 21:17, 18 ప్రకారము, గ్రుడ్డివారు మరియు కుంటివారునై యుండిన అహరోను సంతతివారు బలిపీఠముల యొద్ద పరిచారము చేయలేదు. అంతమాత్రమేగాక, గ్రుడ్డివారు మరియు కుంటివారు పండుగల సమయములో వారు అర్పణముతో దేవుని సముఖములో అగుపించుటకు ఆస్పదములేనివారై యుండిరని మిశ్నా సెలవిచ్చుచున్నది.[14] బహుశా వారు అన్యజనులు కూడుకొనుచుండిన ప్రాంగణము వరకు మాత్రమే వచ్చునట్లు కట్టుదిట్టము చేయబడినవారై, లోపలి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించుటకు అనుమతి లేనివారై యుండవచ్చును (2 సమూయేలు 5:8; LXX).[15] యేసు ఆయన యొద్దకు వచ్చిన గ్రుడ్డివారు మరియు కుంటివారు భౌతికముగా స్వస్థపరచబడుట, వారు దేవునితో కలిగియుండిన ఆధ్యాత్మిక అనుబంధము గూర్చిన అంతర్భావములు కలిగియుండినది. ఇంతకు మునుపటి వచనముల వలెనే, దేవాలయమునకు వచ్చినవారు వారి ఆరాధనలో దేవుని యొద్దకు సన్నిహితముగా సమీపింపవలెనని యేసు ఎంతో ఆశించుచుండెను. స్వస్థతలు చేకూరిన అద్భుత కార్యములు యేసు యెరూషలేములో ఆయన సిలువవేయబడక మునుపు చేసిన స్వస్థత కార్యములలో చివరివై యుండినవి.

**వచనము 15.** యూదుల నాయకులు, **ప్రధాన యాజకులును శాస్త్రులును**, మత్తయి వ్రాసిన సువార్తలో ఇప్పటి నుండి ఇక ముందుకు ప్రధాన పాత్రలు పోషించుచున్న ప్రాముఖ్యులై యున్నారు (2:4పై గల వ్యాఖ్యానము చూడు). వారు అదివరకే యేసు విషయంలో **ఆగ్రహము చెందినవారై** యుండిరి; వారు ఆయన మీద కోపముతో మండిపడుటకు యింకా అల్పమైన హేతువేదైనను దొరికితే చాలన్నట్లుండిరి. ఆయన దేవాలయమును శుద్ధీకరించిన విషయంలో వారు ఆయన మీద ఆగ్రహముచెందినవారై యుండిరి (మార్కు 11:18), కానీ వారు యేసు చేసిన **వింతలను** తమ కళ్లారా చూసారు. గనుక వారు యేసు చేసిన స్వస్థత కార్యముల గూర్చి ఉత్తేజవంతులగుటకు బదులుగా, వారు కోపముతో ఉద్రేకవంతులయ్యారు. ఈపాటికి, **దేవాలయములోనికి** చేరుకొనిన అనేక మంది **చిన్నపిల్లలు** యేసుతో కూడ యెరూషలేము పట్టణము లోనికి వచ్చిన జనసమూహములతో కలిసి వారు వేయుచుండిన

కేకలు వీరు కూడ వేయుచుండిరి: **దావీదు కుమారునికి జయము!** (21:9).

**వచనము 16.** యూదుల నాయకులు యేసును గద్దించారు, నిజానికి, ఆయన ఆ **చిన్నపిల్లలను** గద్దింపవలెనని వారు సాధికారంతో ఆయనను అడుగుచుండిరి. వారు దేవాలయమును ఒక సంత వీధిగా మార్చిన వారి గూర్చి ఆగ్రహము చెందలేదు, కానీ ఈ చిన్న పిల్లల స్తుతులనుబట్టి మనస్సులో నొప్పింపబడినవారగుట వ్యంగ్యముగా నున్నది.[16] నిస్సందేహముగా యేసు, ఒక యూదా మతోపదేశకుడుగా, "దావీదు కుమారుడు" అను బిరుదును అంగీకరించుట వారికి యింకా ఎక్కువ కోపము పుట్టించినది. ఈ నాయకులకు, యేసు "కేవలము ఒకని అహం ఎవరి వశములోను లేకుండా చెయ్యిజారిపోవునట్లు వాని పేరుప్రతిష్ఠలు అనుమతించిన కృపావరములుగల మరొక నాయకుడై యుండెను" అని క్రెయిగ్ ఎస్. కీనర్ చెప్పుచున్నాడు.[17] ఏది ఏమైనా, దానిలో ఇంతకు మించిన యింకా లోతైన అర్థముండును. ఈ నాయకులు యేసు దైవత్వమును ఎదిరించారు గనుక ఇప్పుడు ఆయనను తృణీకరించుటకు సిద్ధమయ్యారు.

ఆయన వారి మాటలను అయిష్టంగా ఇష్టపడుటకు బదులుగా, యేసు సెప్టువజింట్‌లోని కీర్తనలు 8:2ను ఉల్లేఖించి చెప్పుచున్నాడు: **బాలుర యొక్కయు చంటిపిల్లల యొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితివి అను మాట మీరెన్నడును చదువలేదా? అని వారితో చెప్పెను. మీరెన్నడును చదువలేదా?** అను ప్రశ్న, యేసు యొక్క ఆదర్శప్రాయమైన పద్ధతై యుండినది (12:3పై గల వ్యాఖ్యానము చూడు). "బాలురు" ( *nēpios* నుండి), "చంటిపిల్లలు" (*thēlazō* నుండి) అను పదములు మూడు సంవత్సరముల లోపు వయస్సున్న చిన్నపిల్లలను సూచించినవి, సర్వసాధారణముగా పిల్లలు ఈ వయస్సులో తల్లి పాలు త్రాగుట మాన్పింపబడుచుండిరి.[18] యేసును స్తుతించుచుండిన పిల్లలు కీర్తనల గ్రంథంలో చిత్రీకరింపబడిన పిల్లల కంటె ఎంతో పెద్దవయస్సు గల పిల్లలై యుందురు. తల్లి పాలు త్రాగు చంటి పిల్లలు సహితము ఆయనను స్తుతించగలుగుచుండగా, ప్రవచనము ప్రకారము, వారి కంటె పెద్ద వయస్కులైన పిల్లలు సహితము ఆయనను స్తుతించకుండా ఉండలేరని ఈ యూదులు ఎందుకు అనుకొనకూడదని యేసు సూచించుచుండెను. అంతకు మునుపు, దేవుని యందు నమ్మకముంచుట యను అంశమును సోదాహరణంగా చిత్రీకరించుటకు యేసు చిన్నపిల్లలను ఉదాహరణంగా తీసుకొన్నాడు (18:1-4; 19:13-15).

**వచనము 17.** యేసు దేవాలయములో ఉండిన యూదా నాయకులను అర్ధాంతరంగా విడిచిపెట్టి పట్టణములో నుండి వెళ్లిపోయాడు. ఆయన **తిరిగి బేతనియకు వచ్చాడు, ఆ రాత్రి అచ్చట బసచేసాడు** (21:1పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన మొదట బేతనియకు వచ్చాడు (యోహాను 12:1), శ్రమల వారమంతా కూడ బేతనియకు తిరిగి వచ్చుచుండెను. ఆయన మరియ, మార్త, మరియు వారి సహోదరుడైన లాజరు ఇంటిలో బసచేసియుండును. యెరూషలేము ఈ పండుగ సమయంలో రోమా సామ్రాజ్యము నలుమూలల నుండి వచ్చిన యూదులై యుండిన యాత్రికులతో కిక్కిరిసిపోయింది. బేతనియ యెరూషలేమునకు ఎంతో సమీపంలో ఉండింది, గనుక యేసు మరియు ఆయన శిష్యులు ఉదయమే యెరూషలేమునకు వెళ్లి సాయంకాలానికల్లా బేతనియకు తిరిగి వచ్చుచుండిరి. ఏది ఏమైనా, అది వారికి యూదా నాయకుల నుండి అవసరమై యుండిన కాపుదల నిచ్చుటకు చాలినంత దూరములో ఉండింది.

## యేసు అంజూరపు చెట్టును శపించుట[19] (21:18-22)

**18ఉదయమందు పట్టణమునకు మరల వెళ్లుచుండగా ఆయన ఆకలిగొనెను. 19అప్పుడు**
**త్రోవప్రక్కను ఉన్న యొక అంజూరపుచెట్టును చూచి, దానియొద్దకు రాగా, దానియందు**
**ఆకులు తప్ప మరేమియు కనబడలేదు గనుక దానిని చూచి-ఇక మీదట ఎన్నటికిని నీవు**
**కాపు కాయకుందువు గాక అని చెప్పెను; తత్‌క్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను.**
**20శిష్యులదిచూచి ఆశ్చర్యపడి-అంజూరపు చెట్టు ఎంత త్వరగా ఎండిపోయెనని**
**చెప్పుకొనిరి. 21అందుకు యేసు-మీరు విశ్వాసముగలిగి సందేహపడకుండిన యెడల, ఈ**
**అంజూరపుచెట్టునకు జరిగిన దానిని చేయుట మాత్రమే కాదు, ఈ కొండను చూచి-నీవు**
**ఎత్తబడి సముద్రములో పడవేయబడుదువు గాకని చెప్పినయెడల, ఆలాగు జరుగునని మీతో**
**నిశ్చయముగా చెప్పుచున్నాను. 22మరియు మీరు ప్రార్థనచేయునప్పుడు వేటిని అడుగుదురో**
**అవి (దొరకినవని) నమ్మినయెడల మీరు వాటినన్నిటిని పొందుదురని. వారితో చెప్పెను.**

**వచనము 18.** మొదట్లో, క్రీస్తు శ్రమల వారములోని దినముల గూర్చిన వివరముల విషయంలో మత్తయి వ్రాసిన వాటికిని మార్కు వ్రాసిన వాటికిని పరస్పర వ్యత్యాసములున్నట్లు అగుపించును; కానీ సువార్తల రచయితలు ఈ వృత్తాంతములను వేర్వేరు కోణాల్లో చూసారని మనము అర్థంచేసికొన్నప్పుడు ఆ సమస్య తొలగిపోతుంది. మార్కు కాలక్రమానుగత పద్ధతిని అనుసరించాడు. యేసు అంజూరపు చెట్టును మొదటిసారి సోమవారము శపించాడనియు, రెండవసారి మంగళవారం నాడు శపించాడనియు, దేవాలయ శుద్ధీకరణము ఈ రెండు రోజుల మధ్య జరిగినదనియు ఆయన రచించాడు (మార్కు 11:1, 12, 19, 20). దీనికి తారతమ్యముగా, మత్తయి, చర్చనీయాంశముల ప్రకారమైన పద్ధతిని అవలంబించి, యేసు అంజూరపు చెట్టును శపించుట గూర్చిన వివరమును అంతా ఒక్కసారే రచించాడు. మత్తయి 21:18, 19లో వ్రాసిన విషయం సోమవారం నాడు జరిగినదనియు, 21:20-22లో వ్రాసిన భాగము మంగళవారం నాడు జరిగినదనియు మార్కు వ్రాసిన వివరము స్పష్టము చేయుచున్నది.[20]

యేసు తన శిష్యులతో కూడ బేతనియ నుండి (21:17) తిరిగి యెరూషలేమునకు వెళ్లుచుండగా, **ఆయన ఆకలిగొనెను**. ఈ మాటలు యేసు యొక్క మానవత్వమును ఉద్ఘాటించుచున్నవి, ఆయన అలసటచెందాడనియు, దాహముగొన్నాడనియు యింకా కొన్ని యితర వాక్యభాగములు చెప్పుచున్నవి (యోహాను 4:6, 7; 19:28). ఈ సంఘటన **ఉదయమందు** జరిగినది. అది బేత్పగేకు సమీపమున జరిగినది (21:1). యేసు అప్పటికి ఉదయకాల ఉపాహారమును సేవించాడో లేదో వాక్యభాగము మనకు తెలియజెప్పుట లేదు.

**వచనము 19.** వారు ప్రయాణమై వెళ్లుచుండగా, యేసు **త్రోవ ప్రక్కను ఉన్న యొక అంజూరపు చెట్టును** చూసాడు. ఆయన దాని యొద్దకు రాగా, **దానియందు ఆకులు తప్ప మరేమియు కనబడలేదు**. చిన్న చిన్న అంజూరపు పండ్లు, అరబ్బుల చేత *taksh* అని పిలువబడినవి, మార్చి మాసములో ఆకులతోపాటు అగుపించుట అది సర్వసాధారణమైన సంగతై యుండింది. వీటిని తినవచ్చును, గనుక అవి సంతలో అమ్మబడుచుండినవి. ఏది ఏమైనా, పూర్తిగా పెరిగి పెద్దవై పక్వమైన పండ్ల కోత ఎండకాలంలో కోయబడుతుంది. ఇందు చేతనే, యేసు ఆ చెట్టు మీద తినదగిన కొన్ని చిన్న చిన్న పండ్లైనా ఉండకపోతాయా

అని ఆశించాడు, అయితే సాంకేతికముగా "అది అంజూరపు పండ్ల కాలము కాదు" (మార్కు 11:13). హ్యారిసన్ ఇలా చెప్పుచున్నాడు, "వసంత కాలములో చిగురాకులు అగుపించునప్పుడు, ఫలవంతమైన ప్రతి అంజూరపు చెట్టు కొన్ని *taksh* లనైనా కలిగియుంటుంది ... కానీ ఆకులున్న చెట్టుపై ఫలములు లేనట్లయితే, అది ఆ పండ్లకాలమంతయు ఎటువంటి కాయలనైనను కాయదు."[21]

యేసు చూచిన చెట్టుపై ఆకులు తప్ప మరేమియు కనబడనందున ఆయన, "ఇకమీదట ఎన్నటికిని నీవు కాపు కాయకుందువుగాక" అని పలికాడు. యేసు **ఇకమీదట ఎన్నటికిని నీ పండ్లు ఎవరును తినకుందురుగాక!** అని పలికినట్లు మార్కు 11:14లో వ్రాయబడి యున్నది. "తత్క్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను" అని చెప్పుచు, మత్తయి **తత్క్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను** అని తెలుపుచూ యేసు మాటల్లోగల శక్తిని నొక్కివక్కాణించుచున్నాడు. ఈ అంజూరపు చెట్టు, ఆకులుకుండినవి కాని తొలి లేత పండ్లు లేని చెట్టు, దేవుని కొరకు తగిన ఫలములు ఫలించని అనేక మంది యూదులకు సముచితమైన సంకేతమై యుండింది (మీకా 7:1, 2; మత్తయి 7:19). వారు బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పిన బోధలు మరియు యేసు చెప్పిన ఉపదేశములు అన్నీ విన్నా, మారుమనస్సు నొందలేదు (3:8, 10; 11:16–24). వారు ఆలయములో చేయుచుండిన ఆరాధనలు అవినీతిమయమైనవై యుండెను. వారు మెస్సీయాను తృణీకరించారు మరియు త్వరలోనే ఆయన సంహరింపబడవలెనని కోరుదురు. తత్ఫలితంగా, యెరూషలేము మరియు దేవాలయము చివరకు నాశనమగును (24:1, 2).

**వచనము 20.** మరునాటి ఉదయము (మార్కు 11:20), వారు యెరూషలేమునకు తిరిగి వచ్చుచుండగా, **శిష్యులు ఆ అంజూరపు చెట్టును చూచి అది ఇంతలోనే ఎండిపోయినదని** గ్రహించారు. ఆ అంజూరపు చెట్టు ఎండిపోవుచుండిన ప్రక్రియను వారు తమ కళ్లారా చూడలేదు, కానీ అది ఎండిపోయిన తరువాత చూసారు. ఆ చెట్టు సాధారణముగా సంభవించు సహజ ప్రక్రియ ప్రకారము నెమ్మదిగా కొంత కాలమునకు ఎండిపోలేదు, గనుక వారు ఆశ్చర్యపడ్డారు; యేసు దానిని శపించిన ఒక రోజు తరువాత, ఆ చెట్టు పూర్తిగా ఎండిపోయింది. అంతకు ముందటి రోజున ప్రభువు చేసిన కార్యములను గుర్తుకు తెచ్చుకొనుచు పేతురు, "బోధకుడా, యిదిగో నీవు శపించిన అంజూరపు చెట్టు ఎండిపోయినది" అని యేసుతో చెప్పాడు (మార్కు 11:21). ఇదొక గొప్ప అద్భుతముగా ఉంటున్నదని శిష్యులు అనుకొన్నారు. శిష్యులు ఎందుకు అబ్బురపడ్డారో యని ఒకరు ఆలోచించాలి, ఎందుకనగా వారు యేసుతో కూడ ఉండిన మూడు సంవత్సరములకు పైబడిన కాలములో ఆయన చేసిన అద్భుత కార్యములను తమ కళ్లారా చూసారు. ఆ సమయంలో, యెరూషలేము పతనము గూర్చి ఈ అద్భుత కార్యము సూచించుచుండిన సందేశమును వారు అర్థంచేసికొనలేదని స్పష్టముగా తెలియుచున్నది.

**వచనము 21.** యేసు ఆ అంజూరపు చెట్టు "ఎందుకు" ఎండిపోయిందో చెప్పకుండానే, ఆ అద్భుత కార్యము "ఎలా" జరిగిందో వివరించాడు.[22] వారు, ఎవ్విధముగాను **సందేహపడకుండా** (చూడు 14:31) దేవుని యందు యథార్థమైన **విశ్వాసము** కలిగియున్నట్లయితే, ఇంత కంటె గొప్ప అద్భుత కార్యములు వారు చేయుదురని ఆయన వారితో చెప్పాడు. ఆయన ఇచ్చట చెప్పిన సంగతి అపొస్తలులకు ప్రత్యక్షంగా ప్రసాదించిన

ఒక వాగ్దానమై యుండినది; అయితే ఆయనను వెంబడించువారు అద్భుత కార్యములను అనునిత్యము చేయగలుగుదురని యేసు చెప్పుచుండలేదు.

వారు **ఈ కొండను** కదిలించగలరనియు, దానిని **సముద్రములో** పడవేయుదురనియు యేసు తన అపొస్తలులతో చెప్పాడు. అయితే ఆయన శిష్యులు అక్షరాలా ఒక కొండను కదిలించి సముద్రములో పడవేయవలెనని ఆయన ఆశించలేదు. కానీ, దానికి బదులుగా, ఆయన దీనిని అలంకారయుక్తముగా ఉపయోగించుచుండెను. అది అసాధ్యము కాకపోయినా, సాధించుటకు సాధ్యముకాదని ఎంచబడు దానినే సాధించవలెనని ఆశించినప్పుడు, కొండను కదిలించుట అను మాటలను యూదులు ఒక రూపకాలంకారముగా ఉపయోగించుచుండిరి (17:20పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 22.** అప్పుడు యేసు, **మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు, వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మినయెడల, మీరు వాటినన్నిటిని పొందుదురని** వారితో చెప్పెను. ఇది ఆయన తన అపొస్తలులకు ఇచ్చిన ఆదేశములో ఒక భాగమై యుండగా, దీని సామాన్య నియమము సమస్త శిష్యులకు వర్తించుచున్నది: క్రైస్తవులు ప్రార్థించునప్పుడు, దేవుడు వారి ప్రార్థనలు ఆలకించుచున్నాడనియు, ఆయన వారి ప్రార్థనలకు ప్రత్యుత్తరమొసగుననియు వారు విశ్వసించుచు ప్రార్థించుచుండవలెను (చూడు 1 పేతురు 3:12). వారు "ఏమాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెనని" యాకోబు తన పాఠకులను హెచ్చరించాడు (యాకోబు 1:6). ఇటువంటి ప్రార్థనలు ఆత్మాభిమానముగలవై యుండకూడదు. క్రైస్తవులు "దేవుని చిత్తానుసారముగా" ప్రార్థించవలెనని యోహాను తన ఆదేశముల నిచ్చుచున్నాడు (1 యోహాను 5:14, 15). ఆయన బిడ్డలు చేయుచుండు ప్రార్థనలకు దేవుడు ఎల్లప్పుడు ప్రత్యుత్తర మొసగుచుండును, కానీ ఆయన ఎల్లప్పుడు, "ఔను" (ఓకే) అని చెప్పడు. "లేదు" లేక "కాదు" అనునది కూడ ఒక ప్రత్యుత్తరమే (చూడు 2 కొరింథీయులకు 12:7-9).

### యేసు అధికారము సవాలుచేయబడుట (21:23-27)

**[23]ఆయన దేవాలయములోనికి వచ్చి బోధించుచుండగా ప్రధానయాజకులును ప్రజల పెద్దలును ఆయన యొద్దకు వచ్చి-ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? ఈ అధికారమెవడు నీకిచ్చెనని అడుగగా [24]యేసు-నేనును మిమ్ము నొక మాట అడుగుదును; అది మీరు నాతో చెప్పినయెడల, నేనును ఏ అధికారమువలన ఈ కార్యములు చేయుచున్నానో అది మీతో చెప్పుదును. [25]యోహాను ఇచ్చిన బాప్తిస్మము ఎక్కడనుండి కలిగినది? పరలోకము నుండి కలిగినదా, మనుష్యులనుండి కలిగినదా? అని వారినడిగెను. వారు-మనము పరలోకము నుండి అని చెప్పితిమా, ఆయన-ఆలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని మనల నడుగును; [26]మనుష్యులవలననని చెప్పితిమా, జనులకు భయపడుచున్నాము; అందరు యోహానును ప్రవక్త అని యెంచుచున్నారని తమలో తాము ఆలోచించుకొని-మాకు తెలియదని యేసునకు ఉత్తరమిచ్చిరి [27]అందుకాయన-ఏ అధికారమువలన ఈ కార్యములు నేను చేయుచున్నానో అదియు మీతో చెప్పను.**

**వచనము 23.** యేసు యెరూషలేము చేరుకున్న తరువాత, ఆయన **దేవాలయము**

లోనికి వెళ్లాడు. క్రీస్తు శ్రమల వారములో, పస్కా పండుగ నిమిత్తము యెరూషలేములో తండోపతండాలుగా కూడివచ్చిన జనసమూహములకు బోధించుటకు ఆయన అనేక అవకాశములను సద్వినియోగము చేసికొన్నాడు. ఆయన బహుశా ఎక్కువగా అన్యజనులు కూడుకొనుటకు కేటాయింపబడిన ప్రాంగణములోని వెలుపటి ఆవరణములో లేదా దానికీ సమీపములో ఉంటూ తన ఉపదేశములను బోధించి యుండును. ఈ ఆవరణములలో ఒకటి, తూర్పు దిక్కున ఉండిన సొలొమోను ఆవరణము, ఆది సంఘముల కూడికలకు అధికంగా ఉపయోగించుకొనబడింది (చూడు అపొస్తలుల కార్యములు 3:11; 5:12; చూడు యోహాను 10:23).

యూదుల నాయకులు బాప్తిస్మమిచ్చు యోహానును ప్రశ్నించినట్లే (యోహాను 1:19–28), వారు యేసును కూడ ప్రశ్నించారు.[23] ఆయన దేవాలయములో **బోధించుచుండిన** ఒక సందర్భములో, **ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు**? **ఈ అధికారమెవడు నీకిచ్చెను**? అని వారాయనను ప్రశ్నించారు. యేసు చేయుచుండిన అనేక సంఘటనలు ఈ మనుష్యుల సావధానమును ఆకర్షించినవి: యెరూషలేములో విజయోత్సవముతో ప్రవేశించుట (21:1–11), దేవాలయమును శుద్ధీకరించుట (21:12, 13), గ్రుడ్డివారిని మరియు కుంటివారిని స్వస్థపరచుట (21:14), చిన్న పిల్లలు ఆయనను స్తుతించుట (21:15–17) మొదలగునవి. ఈ సందర్భములో, ఆయన యెరూషలేములోని యూదా మతాధికారుల చేత "రబ్బీ"గా అభిషేకింపబడకపోయినప్పటికిని, యేసు ఒక యూదా మతోపదేశకుడుగా ప్రవర్తించుచుండెను. ఆయన అధికారము తండ్రి నుండి వచ్చినది (చూడు 7:28, 29; 9:6; 10:1; 28:18).

**వచనము 24.** ఆయన వారినడుగు ఒక ప్రశ్నకు వారు సమాధానమిచ్చినట్లయితే, అప్పుడు ఆయన తన **అధికారమునకు** గల మూలధారమేమిటో వారికి తెలియజెప్పునని **యేసు** ఆ నాయకులతో చెప్పాడు. క్రీస్తు తరుచుగా ప్రశ్నకు, మరొక ప్రశ్నతో సమాధానమిచ్చాడు. డబ్ల్యు. ఎఫ్. ఆల్‌బ్రైట్ మరియు సి. ఎస్. మన్ ఇలా చెప్పుచున్నారు, "అడుగబడిన ప్రశ్నకు ఎదురు ప్రశ్న వేయు విధానము, మన ఆలోచనా విధానమునకు, సమాధానము చెప్పుట నుండి తప్పించుకొనుటకు అవలంబించబడు యుక్తుల వలె అగుపించవచ్చును, కానీ అది హెల్లీనీయుల మరియు అటుతరువాతి యూదామతోపదేశకుల కాలములలోను, క్రీ.పూ. ఐదవ శతాబ్దము నాటి గ్రీకుల కాలములోను నిర్వహింపబడుచుండిన చర్చలలో ఒక సర్వసాధారణమైన విధానమై యుండినది."[24] ఈ నాయకులు నిజాయితీపరులై యుండినట్లయితే, యేసు వారినడిగిన ప్రశ్నకు వారిచ్చు సమాధానమే వారడిగిన ప్రశ్నకు సమాధానమై యుండేది.

**వచనములు 25, 26. యోహాను ఇచ్చిన బాప్తిస్మము** ఎక్కడ నుండి కలిగినది? **పరలోకము నుండి కలిగినదా, మనుష్యుల నుండి కలిగినదా**? అని యేసు ప్రధానయాజకులను మరియు పెద్దలను అడిగాడు. "పరలోకము" అను పదము యూదులలో "దేవునికి" ఒక సర్వసాధారణమైన ప్రత్యామ్నాయ పదమై యుండినది; దైవికమైన నామము దూషింపబడకుండునట్లు ఈ పదము వాడబడినది (నిర్గమకాండము 20:7). దేవుని నుండి లేదా, మనుష్యుల నుండి – ఈ రెండు మాత్రమే వారి ముందుండిన వికల్పములై యుండినవి, మరియు అవి పరస్పరము విశిష్టమైనవై యుండెను (చూడు అపొస్తలుల

కార్యములు 5:38, 39).

యేసు వారికి ఎదురు ప్రశ్న వేసినప్పుడు వారు తమ్మును తామే ఒక క్లిష్టమైన పరిస్థితిలోనికి పారవేసుకొన్నారని ఈ నాయకులు గ్రహించారు. ఏలయనగా వారు “పరలోకము నుండి” కలిగినదని ప్రత్యుత్తరమిచ్చినట్లయితే, యేసు **ఆలాగైతే మీరెందుకు అతని నమ్మలేదు?** అని అడుగును. వారు బాప్తిస్మమిచ్చు యోహానును ఒక ప్రవక్తగా అంగీకరించినట్లయితే, వారు యేసును మెస్సీయగా అంగీకరించునట్లు కూడ అది వారిని బలవంతముచేయును, ఏలయనగా బాప్తిస్మమిచ్చు యోహాను యేసు ఎవరో యని ఆయన గుర్తింపును ప్రకటించాడు (యోహాను 1:29–34). ఏది ఏమైనా, వారు యోహానును తృణీకరించారు (21:32). వారు **మనుష్యుల నుండి** కలిగినదని చెప్పినట్లయితే, **ప్రజలు బాప్తిస్మమిచ్చు యోహానును ఒక ప్రవక్తగా పరిగణించారు** (14:5) కాబట్టి, వారు అల్లరి చేయుదురేమో అని వారు భయపడుచుండిరి.

**వచనము 27.** ప్రధాన యాజకులు మరియు పెద్దలు సత్యమును వెదుకుట కంటే, వారి అధికార హోదాలను కాపాడుకొనుట గూర్చి ఎక్కువగా ఆందోళన చెందుచుండిరి. గనుక వారు, **మాకు తెలియదు** అని **యేసుతో** చెప్పారు. వారు తమ అభిప్రాయమును ప్రకటించుటకు బదులుగా, రాజకీయపరంగా సరైన మార్గమై యుండిన తటస్థ విధానమునే ఎన్నుకొన్నారు. కాబట్టి, యేసు, **ఏ అధికారము వలన ఈ కార్యములు నేను చేయుచున్నానో అదియు మీతో చెప్పను** అని ప్రత్యుత్తరమిచ్చాడు. ప్రభువైన యేసు ప్రతిస్పందన “వారి వేషధారణను బయటపెట్టింది మరియు అదే సమయంలో ఆయన అధికారము యోహానుకుండిన అధికారమే అని ప్రజలకు స్పష్టముగా తెలియజెప్పింది.”[25]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## బలహీనుల యెడల కనికరము (21:14–17)

ప్రతి నిత్యము, సామాజికంగా నిమ్నస్థాయిలో లేదా ఎవరూ పట్టించుకొనని పరిస్థితుల్లో ఉండినవారి యెడల యేసు కనికరము కనుపర్చాడు. ఆయన గ్రుడ్డివారిని మరియు కుంటివారిని స్వస్థపర్చుట ద్వారా, వారు యికమీదట బిచ్చమెత్తకుండునట్లు వారి దౌర్భాగ్య స్థితి తొలగిపోవునట్లును చేసాడు. వారు శారీరకంగా స్వస్థత నొందుట మాత్రమేగాక, ఆధ్యాత్మికంగా కూడ ఆశీర్వదింపబడ్డారు, గనుక దేవుని యొద్దకు ఆలయములో ప్రవేశించగలిగారు. నానావిధములైన రోగముల చేతను లేక గాయముల చేతను బాధపడుచుండువారి యెడల మనము జాలిపరులపై యుండవలెను. ఇంత కంటె ఎక్కువగా, మనము వారి ఆత్మల గూర్చి ఆందోళన చెందుచుండవలెను.

యేసు చిన్న పిల్లల యెడల కూడ ఆసక్తిపరుడై యుండెను. ఆయన వారిని ఆలింగనము చేసికొనుచు వారిని ఆశీర్వదించాడు. వారి స్తుతులను ఎంతో సంతోషముతో అంగీకరించాడు. పిల్లలు ప్రభువును ప్రేమింపవలెనని, వారికి చిన్న నాటి నుండియే, తల్లి గర్భములో ఉన్నప్పటి నుండియే నేర్పించుటకు మనము మనస్ఫూర్తియైన శ్రద్ధతో ప్రయాసపడవలెను. మనము వారికి నేర్పించవలెను, వారిని ప్రోత్సాహించవలెను, మరియు వారిని కాపాడవలెను.

డేవిడ్ స్టూవర్ట్

## ఎండిపోయిన చెట్లు మరియు నిరాకరింపబడిన రాళ్లు (21:18-46)

మత్తయి 21:18-46లో, ఆయన కాలము నాటి అవిశ్వసనీయమైనవారై విరోధముగా తిరుగుబాటు చేసిన యూదులను యేసు వ్యతిరేకించాడు.

1. *ఫలములేని ఒక అంజూరపు చెట్టు* (21:18-22). అంజూరపు చెట్టు విషయంలో యేసుకు ఆశాభంగము కలిగింది ఏలయనగా దూరము నుండి చూచినప్పుడు దానిపై అంజూరపు పండ్లు ఉండినప్పుడు అది అగుపించింది, కానీ దగ్గరికి వచ్చి పరిశీలనగా చూచినప్పుడు ఫలములేమియు లేవు. ఆ నాటి అనేక మంది దేవుని ప్రజలకు అదొక సముచితమైన సంకేతమై యుండింది. వారికి ధర్మశాస్త్రముండింది గనుక వారు నీతి ఫలములను ఫలించవలసినవారై యుండిరి, కానీ వారు ఫలించలేదు. మున్ముందు సంభవింపనై యుండిన యెరూషలేము నాశనమునకు సంకేతముగా నుండునట్లు యేసు అంజూరపు చెట్టును శపించాడు. యేసు అంజూరపు చెట్టును ఎందుకు శపించాడో శిష్యులు గ్రహించలేదు సరికదా, ఆయన ఎలా శపించాడో యని వారు అబ్బురపడ్డారు. యేసు వారికి విశ్వాసము గూర్చి బోధించుటకు ఆయన దీనికొక సదవకాశంగా సద్వినియోగము చేసికొన్నాడు.

2. *విశ్వాసములేని ప్రజలు* (21:23-32). ఆయన ఎన్నో అద్భుతకరమైన సూచక క్రియలు చేసినప్పటికిని, యూదా ప్రజల నాయకులు యేసునందు విశ్వాసముంచరైరి. దానికి బదులుగా, వారు ఆయన ఏ అధికారము వలన ఆ కార్యములు చేయుచుండెనో యని ప్రశ్నించారు. వారు సత్యమును వెదకి దానిని కనుగొనుటకు బదులుగా, యేసుపై నేరారోపణ చేయుటకు ప్రయత్నించుచుండిరి. ఇద్దరు కుమారుల గూర్చి ఆయన వారికి చెప్పిన ఉపమానములో యేసు వారి అవిధేయతను బట్టబయలుచేసాడు.

3. *విఫలమైన విధానము* (21:33-46). ఇంటి యజమానుడు మరియు ద్రాక్ష తోట గూర్చిన ఉపమానములో, యూదా నాయకులు తరుచుగా దేవుని చిత్తమును తృణీకరించుచుండిన విషయమును యేసు బహిరంగము చేసాడు. వారి చరిత్ర ద్వారా, రాజ్యముపై ఆయనకు గల అధికారమును అన్యాయముగా ఆక్రమించుకొనుటకు వారు ప్రయత్నించారు. వారు మారుమనస్సు నొందునట్లు వారిని హెచ్చరించుటకు ఆయన వారి యొద్దకు పంపించిన ప్రవక్తలను వారు హతమార్చారు. చిట్టచివరకు, వారు తన సొంత కుమారుని సహితము చంపివేసారు. కాబట్టి, వారు శిక్షింపబడుదురు, మరియు దేవుడు విశ్వాసముగల నూతన ప్రజలను – సంఘమును – స్థాపించును.

డేవిడ్ స్టూవర్ట్

## యోహాను బాప్తిస్మము (21:23-27)

గ్రీకు క్రియా పదము *baptizō* ఎల్లప్పుడు ముంచుట, లేక నీటిలో పూర్తిగా ముంచబడుట అను అర్థము కలిగియుండును. ఒకడు బాప్తిస్మము పొందు మాధ్యమము ఏదైనను దానితో నిమిత్తము లేకుండా దీని గూర్చిన సత్యము ఇదే. క్రొత్త నిబంధన ఐదు వేర్వేరు బాప్తిస్మముల గూర్చి ప్రస్తావించుచున్నది. ఒకటి, శ్రమ నొందుట యను బాప్తిస్మము మరియు (మార్కు 10:38, 39). రెండు బాప్తిస్మములు మత్తయి 3:11లో పేర్కొనబడి యున్నవి: పరిశుద్ధాత్మ బాప్తిస్మము మరియు అగ్ని బాప్తిస్మము (ఇది పాపులు నరకాగ్నిలో

వేయబడుటను సూచించుచున్నది; 3:11, 12పై గల వ్యాఖ్యానము చూడు). బాప్తిస్మమిచ్చు యోహాను బాప్తిస్మము మరియు మహా ఆదేశమునకు సంబంధించిన బాప్తిస్మము (28:19, 20) పేర్కొనబడి ఇంకా రెండు బాప్తిస్మములై యున్నవి.

బాప్తిస్మమిచ్చు యోహాను "మారుమనస్సు నిమిత్తమైన బాప్తిస్మము" ఇచ్చినప్పటికిని, అనగా ఈ బాప్తిస్మము పొందినవారు వారి పాపముల గూర్చి మారుమనస్సు నొందవలెనని పిలుపు ఇవ్వబడినదని అర్థమిచ్చుచున్నప్పటికిని (3:8), అది "పాపక్షమాపణ నిమిత్తమైన" బాప్తిస్మమై యుండినది (మార్కు 1:4). యేసు వచ్చి తన రక్తమును చిందించిన కార్యము దృష్ట్యా వారికి బాప్తిస్మమియ్యబడింది. యేసు క్రీస్తు సిలువ మీద మరణించక మునుపు బాప్తిస్మమిచ్చు యోహాను ఇచ్చిన బాప్తిస్మము పొందినవారు మరలా బాప్తిస్మమియ్యబడ్డారని వ్రాయబడిన వివరాలు మనకెక్కడను లేవు. పెంతెకొస్తు దినాన బాప్తిస్మము పొందినవారు మూడు వేల మంది "చేర్చబడిరి" అను ప్రకటన (అపొస్తలుల కార్యములు 24:1 NIV) రాజ్యము లోనికి కొందరు అదివరకే చేర్చబడి యుండిరను ధ్వనింపు నిచ్చుచున్నది. ఎఫెస్సు పట్టణములో పౌలు చేత బాప్తిస్మము పొందిన పన్నెండు మంది క్రీస్తు మరణము మరియు మహా ఆదేశమునకు సంబంధించిన బాప్తిస్మ విధానము వ్యవస్థాపింపబడిన *తరువాత* మరలా బాప్తిస్మమిచ్చు యోహాను బాప్తిస్మముతో బాప్తిస్మమియ్యబడ్డారు (అపొస్తలుల కార్యములు 19:1–7). క్రీస్తు రక్తము ధర్మశాస్త్రము క్రింద జీవించినవారి పాపములను కప్పుగలిగినట్లయితే, యేసు సిలువవేయబడక మునుపు బాప్తిస్మమిచ్చు యోహాను బాప్తిస్మ విధానములో బాప్తిస్మము పొందినవారి పాపములను కూడ అది నిశ్చయముగా కప్పును (హెబ్రీయులకు 9:15).

---

సూచనలు

[1]Josephus *Antiquities* 15.11.1. అదిహేరోదు తన పరిపాలనను క్రీ.పూ. 37లో మొదలుపెట్టాడు, దేవాలయ నిర్మాణ పనులు "అతని పరిపాలనా కాలములోని పదునెనిమిదవ సంవత్సరములో" (క్రీ.పూ. 19) మొదలుపెట్టబడినవి. [2]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 300. [3]*Psalms of Solomon* 17.21, 30. [4]మొదటి శతాబ్దములోని ప్రధాన యాజకుల పేరాస గూర్చిన వివరముల కొరకు, Josephus *Antiquities* 20.8.8; 20.9.2. [5]Mishnah *Shekalim* 1.1-3. [6]Ibid., 4.8, 9. [7]Mishnah *Bekhoroth* 8.7; Talmud *Kiddushin* 11a. [8]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 526. [9]Mishnah *Kerithoth* 1.7. [10]Mishnah *Berakoth* 9.5.

[11]Donald A. Hagner, *Matthew 14-28,* Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 601. [12]Josephus *Antiquities* 15.11.5; *Wars* 5.5.2; 6.2.4. [13]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 130. [14]Mishnah *Hagigah* 1.1. [15]Hagner, 601. చూడు *Messianic Rule* 2. [16]Morris, 528-29. [17]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 502. [18]2 Maccabees 7:27. [19]చూడు ఇది యేసు అంజూరపు చెట్టును "శపించుట" గూర్చి ప్రస్తావించుచున్నది, మార్కు 11:21. [20]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 773.

[21]R. K. Harrison, "Fig; Fig Tree," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982),

2:302. [22]Keener, 505. [23]సంఘము సంస్థాపింపబడిన తరువాత, పేతురు మరియు యోహానులు కూడ ఇదే విధముగా ప్రశ్నింపబడిరి (అపొస్తలుల కార్యములు 4:5–7). [24]W. F. Albright and C. S. Mann, *Matthew,* The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 260. [25]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 183.